క్లుప్తంగా

వైభవంగా పారువేట ఉత్సవం



దేవతామూర్తులను ఊరేగింపు చేస్తున్న దృశ్యం

కొత్తపల్లి: మండలంలోని దుద్యాల గ్రామంలో వెలసిన శ్రీ లక్ష్మీసమేత వేణుగోపాలస్వామి, శ్రీ పార్వతి సమేత మల్లేశ్వరస్వామి వార్ల కల్యాణ మహోత్సవంలో భాగంగా శనివారం సాయంత్రం పారువేట ఉత్సవాన్ని గ్రామపెద్దలు, ఆలయ పురోహితులు బాలసుబ్రహ్మణ్యం, ధర్మకర్తల మండలి చైర్మన్ శ్రీనివాసరెడ్డిలు దేవదాయ శాఖ, ఈఓ కార్తీక ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. సాయంత్రం శ్రీ లక్ష్మీసమేత వేణుగోపాలస్వామి, శ్రీ పార్వతీ సమేత మల్లేశ్వరస్వామి వార్ల ఉత్సవ విగ్రహ మూర్తులను నందీశ్వరుని, అశ్వవాహన పల్లకీలో కొలువుంచి గ్రామంలో ఊరేగించారు. పల్లకీలను గ్రామం పొలిమేర వరకు తీసుకెళ్లి పారువేట ఉత్సవం నిర్వహించారు.

అంబేడ్కర్ ఆశయాలను కొనసాగిద్దాం



విద్యార్థులకు నగదు, అంబేడ్కర్ ఐడియాలజీ పుస్తకాలను పంపిణీ చేస్తున్న దృశ్యం

కొత్తపల్లి: అంబేడ్కర్ ఆశయాలను కొనసాగించాలని విద్యార్థులు పూలే, అంబేడ్కర్ ఆలోచనలను అలవర్చుకోవాలని సత్యశోధక్ సమాజ్ అధ్యక్షుడు ఆత్మకూరు డాక్టర్ నాగన్న, అంబేడ్కర్ ధర్మప్రచారకులు శీలం శేషగిరి రావు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో అంబేడ్కర్, పూలే జయంతి సందర్భంగా నిర్వహించే వ్యాసరచన పోటీలలో గెలుపొందిన వారికి నగదు బహుమతులు పంపిణీ చేశారు.

తాగునీటి సమస్య తలెత్తనివ్వం

పాములపాడు: గ్రామంలో తాగునీటి సమస్య తలెత్తనివ్వమని సర్పంచు వరప్రసాదరావు అన్నారు. శనివారం మండలంలోని తుమ్మలూరు గ్రామంలోని బీసీ కాలనీలో చేతి పంపులకు మరమ్మతులు చేయించారు. ఆయన మాట్లాడుతూ గ్రామంలోని ప్రతి కాలనీలో చేతి పంపులు ఎప్పటికప్పుడు మరమ్మతు చేయిస్తున్నామని చెప్పారు. జెడ్పీటీసీ జ్యోతి రామలింగేశ్వరరెడ్డి సహకారంతో గ్రామంలో ప్రతి సమస్యను పరిష్కరిస్తున్నట్లు తెలిపారు.

వ్యాసరచన పోటీలు

ఆత్మకూరు: మండలంలోని వెంకటాపురం గ్రామంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో శనివారం భారత రాజ్యాంగం, అమలు తీరుపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించారు. పోటీలో గెలుపొందిన వారికి ఈనెల 14వ తేదీన అంబేడ్కర్ జయంతి సందర్భంగా బహుమతులను అందజేస్తున్నట్లు ఆత్మకూరు బీఆర్ అంబేడ్కర్ విగ్రహ కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు జవహర్‌నాయక్ తెలిపారు.

3,751 మందికి ఉపాధి పనులు

కొత్తపల్లి: మండలంలోని అన్ని గ్రామాలలో ప్రతి రోజు 3,751 మందికి ఉపాధి పనులు కలిప్తున్నట్లు ఏపీఓ రేష్మ శనివారం తెలిపారు. మండలంలోని 11 గ్రామ సచివాలయాల్లో 12 గ్రామ పంచాయతీలలో సుమారు 7,300 జాబు కార్డులు ఉన్నాయన్నారు. అందులో అడిగిన ప్రతి ఉపాధి కూలీకి ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా ఉపాధి పనులు కల్పిస్తున్నామని చెప్పారు.

బీసీలు రాజ్యాధికారం దిశగా పయనించాలి

ఆత్మకూరు: బీసీలు రాజ్యాధికారం దిశగా పయనించాలని జాతీయ బీసీ సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎస్.రఘురాముడు, నియోజకవర్గ గౌరవాధ్యక్షులు రామకృష్ణ, ఉపాధ్యక్షుడు వీరన్నలు అన్నారు. శనివారం బీపీ మండల్ వర్ధంతి సందర్భంగా స్థానిక బీసీ సంఘం కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పెద్ద నాగన్న, బొల్లు ప్రసాద్‌యాదవ్, శ్రీనివాసులు, శివ, నాయక్ పాల్గొన్నారు.

వలంటీర్ల రాజీనామా



రాజీనామా చేసిన కురుకుంద వలంటీర్లు

ఆత్మకూరు: మండలంలో వలంటీర్ల రాజీనామాలు కొనసాగుతున్నాయి. శనివారం కురుకుంద గ్రామానికి చెందిన 20 మంది వలంటీర్లు తమ రాజీనామా పత్రాలను ఎంపీడీఓ శివప్రసాద్ వర్మకు అందజేశారు. శుక్రవారం వివిధ గ్రామాలకు చెందిన 98 మంది వలంటీర్లు రాజీనామాలు చేయగా, ప్రస్తుతానికి కురుకుంద గ్రామానికి చెందిన 20 మంది వలంటీర్లు రాజీనామాలు చేయగా, ఇద్దరు వలంటీర్లు చేయలేదు. రాజీనామాలను ఆమోదించినట్లు ఎంపీడీవో తెలిపారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

మిడుతూరు: మండలపరిధిలోని తలముడిపి గ్రామంలో ఇద్దరు వ్యక్తుల నుంచి 50 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ జగన్‌మోహన్ శనివారం తెలిపారు. తలముడిపి గ్రామానికి చెందిన రంగస్వామి, మద్దిలేటి మద్యం విక్రయిస్తుండగా సమాచారం మేరకు దాడులు చేసి ఇద్దరి నుంచి 50 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నామన్నారు.

- మహానందికి చెందిన అజీమ్ బాషా అటవీ శాఖలో ప్రొటెక్షన్ వాచర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. మార్చి నెల 25వ తేదీన నల్లమలలో అతనిపై చిరుత దాడి చేసింది. వెంటనే స్థానికులు 108 వాహనం ద్వారా నంద్యాల ప్రభుత్వాస్పత్రికి తరలిచండంతో మెరుగైన వైద్యం అందించారు. ప్రస్తుతం అజీమ్ బాషా కోలుకొని, సంపూర్ణ ఆరోగ్యంతో విధులకు వెళ్లారు.
- మహానందీశ్వరుడి దర్శనార్థం మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన రాజు కుటుంబ సభ్యులతో మార్చి 10వ తేదీన మహానందికి వచ్చారు. స్థానిక కోనేరులో పుణ్యస్నానం చేస్తుండగా మూర్ఛవ్యాధికి గురయ్యాడు. స్థానిక వైద్యసిబ్బంది ప్రాథమిక చికిత్స చేయించి వెంటనే 108 వాహనం ద్వారా మెరుగైన చికిత్స కోసం నంద్యాల ఆస్పత్రికి సకాలంలో తరలించడంతో ప్రాణాలతో బయపడ్డాడు.
- మార్చి 24వ తేదీన గిద్దలూరు సమీపంలోని తుర్లపాడు మండలం గానుగపెంటకు చెందిన అశోక్ రైలు నుంచి ప్రమాదవశాత్తు జారి పడ్డాడు. మహానందికి చెందిన 108 ఈఎంటీ రాజయ్య, పైలట్ దస్తగిరిలు సకాలంలో స్పందించి 108 వాహనం ద్వారా నంద్యాల ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లడంతో ప్రాణాలతో బయటపడ్డాడు.
- రుద్రవరం మండల చిన్నకంబలూరుకు చెందిన గర్భిణి సుజాతకు ఈ నెల 6వ తేదీ శనివారం పురిటినొప్పులు అధికమయ్యాయి. కుటుంబ సభ్యులు వెంటనే 108కు కాల్ చేశారు. సమాచారం అందుకున్న మహానందికి 108 అంబులెన్స్ సిబ్బంది ఈఎంటీ రాజయ్య, పైలట్ దస్తగిరి వెంటనే గ్రామానికి చేరుకుని ఆస్పత్రికి తీసుకెళ్తుండగా పురిటినొప్పులు అధికం కావడంతో వాహనాన్ని ఆపి ఆశ కార్యకర్త, గర్భిణి కుటుంబ సభ్యుల సాయంతో అంబులెన్స్‌లోనే ప్రసవం చేయడంతో తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారు.

ఇలా ఒకటేంటి వివిధ రుగ్మతలతో బాధపడేవారు, రోడ్డు ప్రమాదాలకు గురై గాయపడ్డ బాధితులు, గర్భిణులు, కుక్క కాటుకు గురైన వారు, అతిసారం బాధితులు ఇలా ఏడాదిలో సుమారు మూడు వేలకు పైగా కేసుల్లో అందరూ సురక్షితంగా బయపడటంతో 108, సిబ్బందిని ప్రజలు ఆపద్బాందవుల్లా, ప్రాణదాతలుగా కొనియాడుతున్నారు.

ఆపద్బాంధవులు

- ఆపదలో ఉన్నవారిని ఆదుకుంటున్న 108
- వాహనాల నిర్వహణ పట్టించుకోని టీడీపీ ప్రభుత్వం
- సక్రమంగా జీతాలు చెల్లించని దుస్థితి
- వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక 108 వ్యవస్థకు మంచి రోజులు
- పాత వాహనాల స్థానంలో అధునాతనమైన నూతన అంబులెన్స్‌లు
- ప్రజల ప్రాణాలు కాపాడుతున్న జగనన్న ప్రభుత్వంపై ప్రజల ప్రశంసలు



మహానంది మండలానికి ఏర్పాటు చేసిన 108 అంబులెన్స్



మహానంది 108 అంబులెన్స్‌లోనే ప్రసవం తర్వాత క్షేమంగా తల్లీ, బిడ్డ

మహానంది: గతంలో తెలుగుదేశం ప్రభుత్వం 108 అంబులెన్స్ వ్యవస్థను నిర్వీర్యం చేసింది. ఐదేళ్ల పాలనలో వాహనాల మెయింటెనెన్స్ సక్రమంగా చేయకపోవడంతో పాటు సిబ్బందికి సరిగా జీతాలు చెల్లించలేని దుస్థితి ఉండేది. కానీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక పాత వాహనాల స్థానంలో కొత్త వాహనాలను సమకూర్చి అందులో అధునాతనమైన వసతులు కల్పించారు. దీంతో ఆపదలో ఉన్నవారికి మేమున్నామంటూ అండగా నిలుస్తున్నారు 108 సిబ్బంది. రోడ్డు ప్రమాదాల్లో తీవ్రంగా గాయపడ్డవారిని, మూర్ఛకు గురై ప్రాణాలతో కొట్టుమిట్టాడుతున్న వారికి, గుండెపోటుకు గురైన వారిని సకాలంలో ఆస్పత్రులకు చేరుస్తూ వారి జీవితాల్లో వెలుగులు నింపుతున్నారు. ప్రసవవేదన పడుతున్న గర్భిణుల పాలిట ఆపద్బాందవుల్లా మారారు. పలువురికి అత్యవసర పరిస్థితి సమయంలో తోడబుట్టినవారిలా, బంధువుల్లా వారే పురుడు పోస్తున్నారు.

మండలానికి ఒక అంబులెన్స్

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత మండలానికి ఒక అంబులెన్స్ వాహనాన్ని ఏర్పాటు చేశారు. అత్యాధునిక సదుపాయాలతో పాటు రాష్ట్ర చరిత్రలో మొదటిసారిగా చిన్నపిల్లల కోసం నియోటల్ కేర్ అంబులెన్స్‌లు సైతం వచ్చాయి. అంబులెన్స్‌లో అన్ని రకాల బాధితులకు అవసరమయ్యే పరికరాలు సమకూర్చారు. మహానంది మండలానికి కేటాయించిన అంబులెన్స్ వాహనంలో ఆక్సిజన్, మానిటర్, స్కూప్ స్ట్రక్చర్, వీల్ చైర్, స్పైన్ బోర్డు, అంబు బ్యాగ్స్, సక్షన్ మిషన్, సర్జికల్ సిజర్స్, టార్చి లైట్, చైర్స్, బెడ్ అందుబాటులో ఉన్నాయి. గుండెపోటుకు గురైనవారికి, మూర్ఛ బాధితులకు, క్రిమిసంహారక మందు సేవించిన వారికి ఇలా ప్రతి ఒక్కరికి అవసరమైన సేవలు అందిస్తున్నారు.

ఏడాదిలోనే మూడువేలకు పైగా కేసులు

మహానంది మండలానికి కేటాయించిన అంబులెన్స్ వాహనం ద్వారా 2023 ఏడాదిలో 2,988 మందికి సేవలు అందించారు. వీటిలో ప్రెగ్నెన్సీ కేసులు 218, చెకప్ కేసులు 206, రోడ్డు ప్రమాదానికి గురైన వారు 162, అయాసం 192, పాయిజన్ తాగిన వారు 45, గుండెకు సంబంధించిన కేసులు 25, జ్వరాలు, కుక్క కాట్లు, విరేచనాలు, ఇతర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారు 1070 మందికి 108 వాహనం ద్వారా సేవలు అందించారు.

పేదల ప్రాణాలు కాపాడుతున్నారు



కొద్ది రోజుల క్రితం ఉన్నట్లుండి గుండెపోటు రావడంతో 108 వాహనానికి సమాచారం అందించాం. మా కుటుంబ సభ్యులు ఫోన్ చేసిన వెంటనే మహానంది అంబులెన్స్ సిబ్బంది రాజయ్య, దస్తగిరి సకాలంలో స్పందించి అంబులెన్స్‌లో నంద్యాలలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. వెంటనే ఆపరేషన్ జరగడంతో ప్రాణాలతో బయటపడ్డాను. ప్రతి మండలానికి 108 వాహనం ఉండటం వల్లే సకాలంలో వచ్చేస్తూ పేదల ప్రాణాలు కాపాడుతున్నారు.

– ఓబులేసు, మహానంది

అదృష్టంగా భావిస్తున్నాం

ఆపదలో ఉన్నవారికి సేవలు అందించడం అదృష్టంగా భావిస్తున్నాం. కొన్ని కొన్ని సందర్భాల్లో బాధితులు పడే బాధ చూస్తే ఎంతో భయమేసేది, అదే సందర్భంలో ప్రాణాలు కాపాడాలన్న ధైర్యం వచ్చేది. మండలానికి ఒక అంబులెన్స్ ఏర్పాటు చేయడంతో పాటు అన్ని సౌకర్యాలు కల్పించడంతో ఎలాంటి ఇబ్బందులు తలెత్తం లేదు. ప్రజలకు సేవలు అందించడం వరంలా భావిస్తున్నాను.

– రాజయ్య, ఈఎంటీ, మహానంది

ప్రాణాలు కాపాడటం ఎంతో సంతృప్తినిస్తుంది

108 అంబులెన్స్ వాహనం సేవల వినియోగించుకునే వారిలో చాలా మంది బాధితులు ప్రాణాలతో బయటపడినప్పుడు వారి కళ్లల్లో చూసే ఆనందం చాలు మాకు ఎంతో సంతృప్తిని ఇస్తుంది. మహానందీశ్వర స్వామి దర్శనార్థం వచ్చిన పలు జిల్లాల భక్తులు మూర్ఛకు, గుండెపోటుకు గురైన సందర్భాల్లో సకాలంలో వారిని ఆస్పత్రిలో చేర్చాము. ప్రాణాలతో బయటపడినప్పుడు వారు చెప్పే కృతజ్ఞతలే మాకు దేవుడి దీవెనలతో సమానం.

– దస్తగిరి, పైలట్

వైభవంగా ధ్వజస్తంభ, విగ్రహ ప్రతిష్ట



వేడుకల్లో తల్లిదండ్రులతో కలసి పాల్గొన్న శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి

పగిడ్యాల: మండలంలోని పాత ముచ్చుమర్రి గ్రామంలో వాల్మీకి సంఘం ఆధ్వర్యంలో రూపుదిద్దుకున్న సీతారామ లక్ష్మణాంజనేయ స్వామి, ధ్వజ స్తంభం విగ్రహ ప్రతిష్ట వేడుకలు శనివారం వైభవంగా జరిగాయి. దేవతామూర్తులను పురోహితులు సర్వాంగ సుందరగా పట్టు వస్త్రాలతో అలంకరించి శాస్త్రోక్తంగా విగ్రహాలకు ప్రాణప్రతిష్ట చేశారు. అలాగే క్రేన్ సాయంతో ధ్వజ స్తంభాన్ని ప్రతిష్టించగా పురోహితులు తెలకపల్లి రఘురామశర్మ పూజా కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో పూజించారు. వేడుకలకు రాష్ట్ర శాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం అధ్యక్షుడు బైరెడ్డి సిద్ధార్థరెడ్డి, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ నాయకులు డాక్టర్ బైరెడ్డి మల్లికార్జునరెడ్డి, డాక్టర్ బైరెడ్డి ఉషారాణి ముఖ్య అతిథులుగా పాల్గొని పూజలు చేశారు. ఆలయ నిర్మాణానికి తమ వంతు సాయంగా రూ. 4 లక్షలు అందజేసి భక్తిని చాటుకున్నారు. భక్తులకు శాప్ చైర్మన్ ముందస్తు శ్రీరామనవమి శుభాకాంక్షలు తెలిపారు. గ్రామ సర్పంచ్ పెద్ద ఆంజనేయులు, ఎంపీపీ మండ్ల మల్లేశ్వరి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పుల్యాల నాగిరెడ్డి, నాయకులు భూషిరెడ్డి, కాటం రమేష్‌కుమార్‌రెడ్డి, శ్రీపతిరెడ్డి, శ్రీనివాసరెడ్డి, మద్దిలేటి, బోయ మధు, కాటం వెంకటరమణ, వాల్మీకి సంఘం నాయకులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

లంచాలకు తావులేకుండా సంక్షేమ పథకాలు



సంగయ్యపేటలో ఇంటింటి ప్రచారం చేస్తున్న బైరెడ్డి సిద్ధార్థరెడ్డి

నందికొట్కూరు: లంచాలకు తావులేకుండా కుల, మతాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందించిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిఅని శాప్ రాష్ట్ర చైర్మన్, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు బైరెడ్డి సిద్ధార్థరెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని సంగయ్య పేటలో ఇంటింటికీ అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి వివరిస్తూ ఎన్నికల ప్రచారం చేపట్టారు. మీ కుటుంబానికి మేలు జరివుంటే వైఎస్ జగనన్నను మళ్లీ సీఎంను చేసుకుందామని ఎన్నికల ప్రచారంలో ఓటర్లను కోరారు. సిద్ధార్థరెడ్డి మాట్లాడుతూ 2014 ఎన్నికల ప్రచారంలో 600 హామీలు ఇచ్చిన చంద్రబాబు ఏ ఒక్కటీ అమలు చేయలేదని ఆరోపించారు. బీసీలను ఓట్ల కోసం వాడుకున్న చంద్రబాబుకు గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. టీడీపీ మోసపూరిత కుట్రలను ఓటర్లు తిప్పి కొట్టాలన్నారు. సంక్షేమ ప్రభుత్వాన్ని కూలగొట్టేందుకు సీఎం వైఎస్ జగన్ కుటుంబంలో చిచ్చులు పెడుతున్న బాబుకు ఓటుతో బుద్ధి చెప్పాల్సిన బాధ్యత ఎంతైన ఉందన్నారు. మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి, ఎంపీపీ మురళీకృష్ణారెడ్డి, కౌన్సిలర్లు నాయబ్, హమీద్, సురేష్, లాలు, రవూఫ్, చాంద్‌బాషా, కృష్ణ, చిన్నరాజు, గఫార్, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షులు మన్సూర్, నాయకులు చంద్రమౌళి, శివరామకృష్ణారెడ్డి, ఉస్మాన్ బేగ్, అబుబక్కర్, జబ్బార్, రామకృష్ణ, లక్ష్మిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మల్లన్న సేవలో ఐఏఎస్ అధికారి



ఆలయ రాజగోపురం వద్ద ఐఏఎస్ అధికారికి స్వాగతం పలుకుతున్న ఈఓ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్లను ముఖ్యమంత్రి కార్యాలయ ప్రిన్సిపల్ సెక్రెటరీ ముత్యాలరాజు (ఐఏఎస్) దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. శనివారం సాయంత్రం మల్లన్న దర్శనార్థం ఆలయం వద్దకు విచ్చేసిన ఐఏఎస్ అధికారికి ఆలయ రాజగోపురం వద్ద దేవస్థాన ఈఓ డి.పెద్దిరాజు, అర్చక స్వాములు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. మల్లికార్జున స్వామివారికి రుద్రాభిషేకం, భ్రమరాంబాదేవికి కుంకుమార్చన తదితర ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అనంతరం అమ్మవారి ఆలయం వద్దగల ఆశీర్వచన మండపంలో ఆయనకు వేదపండితులు వేదమంత్రాలు పలుకగా, అర్చకులు ఆశీర్వచనాలు అందించారు. ఈఓ స్వామివారి శేషవస్త్రాలను, లడ్డూప్రసాదాలను అందించి సత్కరించారు.

కోనేర్ల వద్ద ఆకతాయిల అల్లరి

మహానంది: మహానంది కోనేర్ల వద్ద ఆకతాయిలు అల్లరి సృష్టించారు. కోనేరులో స్నానం ఆచరిస్తున్న అమ్మాయిలపై అసభ్యంగా ప్రవర్తించడంతో వివాదం నెలకొంది. ఈ ఘటన శుక్రవారం చోటు చేసుకోగా శనివారం వెలుగులోకి వచ్చింది. నంద్యాల, బేతంచర్ల ప్రాంతాలకు చెందిన కొందరు యువకులు మద్యం సేవించి ఆలయంలోకి ప్రవేశించారు.కోనేరులో స్నానం చేస్తున్న అమ్మాయిలతో అసభ్యంగా ప్రవర్తించడంతో స్థానికులు అడ్డుకునే ప్రయత్నం చేయగా వారిపై దాడికి పాల్పడినట్లు సమాచారం. పోలీసులు రంగప్రవేశం చేసి పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. ఆ యువకులపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. దీంతో పాటు కొందరు హిందూయేతరులు కోనేరులో అల్లరి చేయడంతో హిందూ దేవాలయాల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు బసవరాజు నిలువరించే ప్రయత్నం చేయగా వారు వాగ్వాదానికి దిగారు. దేవస్థానం అధికారులు, పోలీసులు వారిని పంపివేయడంతో వివాదం సద్దుమణిగింది.

మౌలిక వసతులు కల్పిస్తాం

నందికొట్కూరు: పోలింగ్ బూత్‌లలో మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ సుధాకర్‌రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలలో పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. అనంతరం బాలికల జిల్లా పరిషత్ ఉన్నత, కోట హైస్కూల్ తదితర పాఠశాలలను సందర్శించారు.

మహానందిలో టెండర్లు మళ్లీ వాయిదా

మహానంది: మహానంది దేవస్థానంలో శనివారం వివిధ అంశాలకు నిర్వహించిన టెండర్లు, బహిరంగ వేలాలు మళ్లీ వాయిదా పడ్డాయి. ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో నవగ్రహాల వద్ద దీపారాధన సామాగ్రి విక్రయం, కొబ్బరిచిప్పల సేకరణ, వాహన పూజల నిర్వహణ, మరుగుదొడ్ల నిర్వహణకు వేలాలు నిర్వహించారు. అయితే టెండరుదారులు ఎవరూ ముందుకు రాకపోవడంతో వాయిదా వేశారు. తక్కువ ధరలకు టెండర్లు తీసుకోవచ్చని టెండరుదారులు కుమ్మక్కైనట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

జార్జిరెడ్డికి నివాళి

నందికొట్కూరు: పట్టణంలోని పీడీఎస్‌యూ కార్యాలయంలో విద్యార్థి ఉద్యమకారుడు జార్జిరెడ్డి వర్ధంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి సంఘం నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు శ్రీరామ్, అజయ్, మాణిక్యం, జగదీష్ పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు అందించాం



షబ్బీర్ ఇంటి వద్ద వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ నాయకులు



వైఎస్సార్‌సీపీలో చేరిన దళిత కుటుంబాలు

- ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి
- అందరి ఆశీస్సులతో 18న నామినేషన్
- టీడీపీ నుంచి భారీగా వైఎస్సార్‌సీపీలోకి చేరికలు
- వడ్లరామాపురంలో పార్టీలో చేరిన మాజీ ఎమ్మెల్యే బుడ్డా సమీప బంధువులు



మగ్బూల్ హుస్సేన్‌ను పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే

వెలుగోడు: శ్రీశైలం నియోజకవర్గ ప్రజల ఆశీస్సులతో ఈ నెల 18న నామినేషన్ దాఖలు చేస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ శ్రీశైల నియోజకవర్గ అభ్యర్థి, ప్రస్తుత ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి ప్రకటించారు. శనివారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు అందించి.. ఎన్నికల్లో గర్వంగా ఓటు అడిగే ధైర్యాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మనందరికీ ఇచ్చారన్నారు. మళ్లీ సీఎంగా ఆయనే ఎన్నికైతే కార్యకర్తల గౌరవం మరింత పెరుగుతుందన్నారు. శ్రీశైలం నియోజకవర్గంలో సేవ చేయడానికి అవకాశం కల్పించిన సీఎం జగన్‌కు కతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యేగా ఐదేళ్ల ఎన్నో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టానని చెప్పారు. తనపై నమ్మకంతో సీఎం జగన్ మళ్లీ ఎమ్మెల్యేగా పోటీ చేసే అవకాశం ఇచ్చారన్నారు. ఇలాంటి మంచి పాలన అందించిన పార్టీ తరపున పోటీ చేసే అవకాశం దక్కడం అదష్టమన్నారు. అందరం కలసి మళ్లీ మన ప్రభుత్వాన్ని తెచ్చుకుందామని పిలుపునిచ్చారు. పేదవారు, పెత్తందార్ల మధ్య జరుగుతున్న యుద్ధంలో అందరూ సైన్యంలా పనిచేయాలని కోరారు. అధికార కాంక్ష, కుట్రలతో కూటమిగా ఏర్పడ్డారని, ప్రజలకు ఏదైనా మంచి చేయాలన్న ఆలోచన వారికి లేదన్నారు. ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి పోచా బ్రహ్మానందిరెడ్డితో పాటు ఎమ్మెల్యే అభ్యర్థి అయిన తన విజయానికి పార్టీ క్యాడర్ అంతా కలసికట్టుగా కషి చేయాలన్నారు. ఈ నెల 18న తలపెట్టిన నామినేషన్ దాఖలు కార్యక్రమానికి అధిక సంఖ్యలో కదిలి రావాలని ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి పిలుపునిచ్చారు.

పలువురు వైఎస్సార్‌సీపీలో చేరిక

పట్టణానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు షబ్బీర్ ఆధ్వర్యంలో 20 కుటుంబాల ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి సమక్షంలో పార్టీలో చేరాయి. అలాగే పట్టణానికి చెందిన మధుమోహన్ ఆధ్వర్యంలో 12 దళిత కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరాయి. పట్టణానికి చెందిన ఉషోదయ వికలాంగుల సమితి నాయకులు మగ్బూల్ హుస్సేన్ గత 30 సంవత్సరాలుగా టీడీపీలో ఉంటున్నారు. ఇటీవల టీడీపీ నేతలు పింఛన్ల పంపిణీని అడ్డుకోవడంతో వారి చర్యలను ఖండిస్తూ శనివారం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ నాయకుడు శిల్పా భువనేశ్వర్‌రెడ్డి, పార్టీ మండల ఇన్‌చార్జ్ రాఘవరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు అంబాల ప్రభాకర్‌రెడ్డి, జేసీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ దేశం తిరుపంరెడ్డి, ఎంపీపీ లాలం రమేష్, సర్పంచ్ జయపాల్, మండల కార్యదర్శి రామ్మోహన్ రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ వంగాల నాగేశ్వర రెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఇలియాస్ ఖాన్, నాయకులు ఖాద్రీ, షంషీర్ అలీ, గోవిందు తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ ఆశీర్వదించండి



వడ్లరామాపురం గ్రామంలో భారీ సంఖ్యలో వైఎస్సార్‌సీపీలో చేరిన నాయకులు



ఏబీఎం పాలెంలో టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరిన దృశ్యం

ఆత్మకూరు: సార్వత్రిక ఎన్నికల్లో తనను మరోమారు ఆశీర్వదించాలని ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి కోరారు. శనివారం పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఏబీఎం పాలెం, వెంగళరెడ్డినగర్, వడ్ల రామాపురం గ్రామాలకు చెందిన వందల కుటుంబాలు టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరాయి. ఆయన మాట్లాడుతూ పేదల సంక్షేమం, వలంటీర్ వ్యవస్థ యథావిధిగా కొనసాగాలన్నా, ఆరోగ్యశ్రీతో కార్పొరేట్ వైద్యం అందాలంటే మళ్లీ వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రావాలన్నారు. ప్రతి కార్యకర్తకు అండగా ఉంటానని, అన్నివేళలా మీ సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానన్నారు.

వైఎస్సార్‌సీపీలోకి చేరికలు

పట్టణానికి చెందిన కొండేటి సోమశేఖర్, లక్ష్మీదేవి, ముంతాజ్, లలితల ఆధ్వర్యంలో భారీ సంఖ్యలో కార్యకర్తలు టీడీపీని వీడి ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. ఏబీఎం పాలెంలో ప్రభుదాస్ ఆధ్వర్యంలో వంద కుటుంబాలు టీడీపీని వీడి పార్టీలో చేరాయి. వెంగళరెడ్డి నగర్‌లో ముత్తుజాబీ, నూర్‌అహ్మద్, జిలాల్, అక్బర్ ఆధ్వర్యంలో 100 కుటుంబాలు టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరాయి. వీరికి ఎమ్మెల్యే శిల్పా కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

వడ్లరామాపురంలో టీడీపీకి షాక్

మండలంలోని వడ్ల రామాపురం గ్రామంలో టీడీపీకి భారీ షాక్ తగిలింది. మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డికి సమీప బంధువులు, ఆ పార్టీలో దశాబ్దకాలం పైగానే పనిచేసిన నాగార్జునరెడ్డి, కృష్ణారెడ్డి ఆ పార్టీని వీడి వైఎస్సార్‌సీపీలోకి చేరారు. వారితో పాటు చిన్న సుబ్బరాయుడు, మహేష్, యల్లయ్య, ప్రభాకర్, ఉసేనయ్య, మస్తాన్‌తో పాటు వంద కుటుంబాలు పార్టీలో చేరాయి. వారు మాట్లాడుతూ.. తాము ఎన్నో సంవత్సరాలుగా టీడీపీలో పని చేశామని, తమకు గుర్తింపు లేకపోవడంతో ఆ పార్టీని వీడి వైఎస్సార్‌సీపీలోకి చేరినట్లు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ శ్రీశైలం నియోజకవర్గం పరిశీలకులు హబీబుల్లా, పట్టణ, మండలాధ్యక్షులు సయ్యద్‌మీర్ రాజమోహన్‌రెడ్డి, అంజాద్ అలీ, పువ్వాడి భాస్కర్, నూర్‌మహ్మద్, బాలస్వామియాదవ్, బోయ రాముడు, రాజారెడ్డి పాల్గొన్నారు.

ఆంధ్ర, తెలంగాణ సరిహద్దుల్లో సెబ్ దాడులు

ఆత్మకూరు: ఆంధ్ర, తెలంగాణ సరిహద్దుల్లోని నల్లమల అడవి పరిధిలో శనివారం ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ రామ్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆంధ్ర సెబ్, తెలంగాణ ఎక్సైజ్ అధికారులు సంయుక్తంగా దాడులు నిర్వహించారు. దాడుల్లో తెలంగాణ పరిధిలోని అమ్రాబాద్ మండలంలో 33.7 లీటర్లు ఐఎంఎల్, 52 లీటర్ల బీరు, 75 లీటర్ల కల్లు, ఐదు లీటర్ల నాటుసాయి స్వాధీనం చేసుకొని ఆరుగురిని అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. లింగాలగట్టు చెక్‌పోస్టు వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. దాడుల్లో నాగర్‌కర్నూల్ అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ సుధాకర్, నంద్యాల, మహబూబ్‌నగర్ టాస్క్ ఫోర్స్ టీంలు పాల్గొన్నాయి.

శ్రీశైలంలో టోల్‌గేట్ వివాదం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలంలో టోల్‌గేట్ వివాదం నెలకొంది. శనివారం రాత్రి నాగార్జున సాగర్-శ్రీశైలం టైగర్ రిజర్వ్ ఫారెస్ట్ ఫీల్డ్ డైరెక్టర్ బి.ఎస్.ఎన్.మూర్తి శ్రీశైలం చేరుకుని దేవస్థానం నిర్వహిస్తున్న టోల్‌గేట్ అటవీశాఖ సరిహద్దులో ఉందని, ఇక్కడ టోల్ వసూలు చేయకూడదని చెప్పారు. సుమారు అరగంట పాటు వాహనాలను టోల్ రుసుము లేకుండా క్షేత్రంలోకి అనుమతించారు. శ్రీశైల దేవస్థాన చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ అయ్యన్న అక్కడికి చేరుకుని అటవీశాఖ అధికారులతో చర్చించారు. దేవస్థాన ఉన్నతాధికారి తమ కార్యాలయం వద్దకు వచ్చి వివరణ ఇవ్వాలని ఫీల్డ్ డైరెక్టర్ ఆదేశించారు. ఉన్నతాధికారులకు సమాచారాన్ని తెలియజేస్తానని సీఎస్ఓ వివరించారు. అనంతరం యథావిధిగా వాహనాలకు టోల్ రుసుము వసూలు చేశారు.